నిష్కృతి

[కథానిక]

❀

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి

వాస్తుశాస్త్రప్రకారం కట్టబడి, పూర్వపద్ధతిని స్ఫురింపజేస్తోన్న ఆ మండువాయిల్లు బాపిరాజు పిత్రార్జిత మనే సంగతి ఆ పేటలోవాళ్ల కందరికీ తెలుసు.

మొదట్లో భారీగా చేసిన పొగాకువర్తకం రాను రాను బాపిరాజు చేసే దానధర్మాలకు తాళలేక సన్నగిలిపోయింది. దాని చిహ్నంగామాత్రం తనింటెదురుగా చిన్న పందెర వేసి, పందెరక్రింద రెండు బల్లలు పరచి, పొగాకు చదరపెట్టి, రోజూ కాస్తో కూస్తో అమ్మి పొట్ట పోషించుకొంటూ, ఈ లోకాన్ని వీడేపర్యంతం ఒకళ్లకు చేయి చాచకుండానే జీవించగలిగాడు బాపిరాజు.

బాపిరాజు బాగావున్న రోజుల్లోనే, ద్వితీయ కళత్రంగా మంగమ్మను చేసుకొన్నాడు. మంగమ్మ మనఃప్రవృత్తి చాలా విచిత్రమైందిగా ఆమెనడతను గమనిస్తోన్న ప్రతిఒక్కరూ అనుకునేవారు.

స్త్రీలోకంలో మంగమ్మలాంటి స్వేచ్ఛాజీవులు అరుదుగా అక్కడక్కడా కనుపించేమాట వాస్తవమే; కాని ఆ స్వేచ్ఛను ఆమె కేవలం కష్టాల్లో ఉండే మానవులకోసం వ్యయిస్తుందంటే ఎవరు ఆశ్చర్యపోరు?

ద్వితీయకళత్రమైనా తనకు తగిన అర్ధాంగి దొరికినందుగ్గాను బాపిరాజు మనస్సులో యెంత మురిసేవాడో అతని ఆంతర్యాన్నెరిగిన మంగమ్మకే తెలుసు.

ప్రథమవివాహఫలితంగా పుట్టిన సత్యం పదోయేడులగాయితు మంగమ్మచేతుల్లోనే పెరిగి పెద్దవాడయ్యాడు.

ఆమె తనపోషణలో ఏమీ పక్షపాతం చూపలేదని తెలుసున్నా కూడా, తండ్రిపోయినతర్వాత తల్లి అలా కష్టాల్లో మానవులను కాపాడ్డంకోసం తిరగడ మనేది సత్యంమనస్సుకు చాలా అసంతృప్తిగానే వుంది. పైగా మానవజాతి చాలా విశ్వాసఘాతుకమైందని, ఏఅనుభవాన్ని పురస్కరించుకొని మానసికంగా జీర్ణించుకున్నాడో, సాటిమానవజాతిపై సత్యానికున్న ద్వేషం మరింకెవ్వరికీ ఉండదేమో నని అనుమానపడ్డంమాత్రం అసత్య మైంది కాదు.

సత్యానికి తనచేతుల మీదుగానే, జగన్నాథపురంలో ఉన్న ఒక గౌరవకుటుంబీకుల పిల్లను పెళ్లి చేసి, అత నొకయింటివా డయ్యా డనే నమ్మకం కలిగిన మీదటే బాపిరాజు భగవత్సాన్నిధ్యం చేరుకున్నాడు.

బాపిరాజు పోయేటప్పటికి మంగమ్మకు నలభయ్యోపడి దాటింది. అంతవరకూ తన కడుపున ఏ కాయా కాయలేదు. మంగమ్మకు తాను గొడ్రాలి నసే చింత లేకపోవడం సరికదా, భర్త చూపిన ఆదర్శాన్ని తాను యే ఆటంకమూ లేకుండా పాటించగలనా, లేనా అనే ఊహామాత్రం ఎక్కువగా బాధిస్తోంది.

బాపిరాజు పెద్దకార్యానికి రావడమే కోడలు సుబ్బాయమ్మ మొదటి రాక.

భర్త పోయినందుకు రోదన స్వరంగాని, అథవా బెంగగా ఉన్నట్లుగాని ఉండక నిశ్చింతగా మంగమ్మ కూర్చోడం కొత్త కోడలికి చాలా విడ్డూరంగానే కనుపించింది.

ఆమె ధైర్యంగా కూర్చొని కొడుక్కి సలహాలివ్వడం, తల్లి చెప్పినట్లు తు, చ, తప్పకుండా సత్యం ఆచరించడం చూస్తూన్న సుబ్బాయమ్మకు కొంత కష్టంగానే కనుపించింది.

పేటలో ఉన్న ఆడా, మగా అనే విచక్షణ లేకుండా అందరూ పలకరించిపోవడం, మొగదల మగాళ్లముందుకూడా మంగమ్మ కొంత కనుమరుగు చూపకపోవడం ఆ కోడలి పవిత్రపు యోచనలకు కొంత నైచ్యంగానే తోచింది.

కార్యమైన అయిదోరోజూనే మంగమ్మ బందీ విడిచిన ఖైదీలా, తుష్టహృదయంతో వీథిలోకి రావడం చూసిన కోడలు చాటుకు వెళ్లి రెండు చెక్కిళ్లూ నొక్కుకుంది.

ఆ పేటలో యెవరికో జబ్బుగా వుం దని కబురు అందినమీదట ఆ రాత్రి మంగమ్మ ఇల్లు విడిచి పేటలోకి వెళ్లింది.

వాలుకుర్చీలో కూర్చొని ఏదో ఆలోచిస్తున్న సత్యందగ్గరకు వచ్చి సుబ్బాయమ్మ "మీ యమ్మ ఎక్కడికి వెళ్లింది?" అని రహస్యభంగిమలో మొగం పెట్టి అడిగింది.

"ఏమో—"అని తన్ను కానట్లుగా ఊరుకున్నాడు.

"ఆమె యెక్కడ కెళ్లేదీ మీ కవసరం లేదా?"

ఈ మాటకు సత్యం త్రుళ్లిపడి లేచి కూర్చొని "నా కవసరం యెంతవరకో నాకు తెలుసు. నీ కవసరం లేని ఈ విషయంలో శ్రుతిమించి ప్రశ్నలు వేయడం పొరపాటని గ్రహించు" అని భర్త యిచ్చిన సమాధానానికి, కాస్సేపు స్తబ్ధతగా నిలబడి, ఇలా అంది: "ఏ అధికారమూ లేని ఈ యింట్లో నే నుండడంకూడా అనవసరమేగా?"

ఈ మాటకు సత్యం దృఢస్వరంతో "నీ కీ యింటివిషయాల్లో పరిపూర్తియైన అధికారం ఉందని గ్రహించినా ఆమెమీద అధికారం చలాయించడానికి మాత్రం నీ కేమీ అధికారం లే దనే సంగతి మరిచి పోవద్దు" అని సమాధాన మిచ్చాడు.

కాస్సేపు నిశ్శబ్దంగా వుండి, సుబ్బాయమ్మ స్ఫుటం తప్పిన హీనస్వరంతో "అయితే రేపు మా యింటికి పంపించండి" అని అడిగింది.

"సరే" అని సమాధాన మిచ్చి నెమ్మదిగా అక్కడనుంచి లేచి వెలుపలకు వెళ్లాడు సత్యం.

సుబ్బాయమ్మ అతడు వెళ్లిన దారిని పరికిస్తూ, పమిటకొంగుతో కళ్లు తుడుచుకుంటూ గదిలోకి వెళ్లి పోయింది.

మఱునాడు సుబ్బాయమ్మప్రయాణసన్నాహం కనిపెట్టిన మంగమ్మ కోడలిదగ్గరగా వెళ్లి "ఎక్కడ కమ్మా ప్రయాణం?" అని మృదుస్వరంతో అడిగింది.

"మా యింటికి"

"ఎవరన్నా తీసుకవెళ్లడానికి వచ్చారా?"

"లేదు"

ఈ సమాధానానికి కొంత ఆశ్చర్యపడింది మంగమ్మ. కోడలి అశ్రుకలుషితమైన మొగాన్ని క్షణం వరకూ నిదానించి "ఈ యింట్లో ఉండడానికి నీ కేమన్నా బాధగా వుందా" అని అడిగింది.

దానికి తిరిగి జబాబు సుబ్బాయమ్మనోటినుండి రా లేదు.

తాను తీసుకవచ్చిన బండిని వీథిలో నిలిపి, ఇంట్లోకి వచ్చిన సత్యం "ప్రయాణసన్నాహం పూర్తయిందా?" అని భార్యకేసి క్రోధంగా చూస్తూ అడిగాడు.

దించిన తల పైకెత్తకుండా "పూర్తయింది" అని అస్పష్టంగా సమాధాన మిచ్చింది సుబ్బాయమ్మ. బండిలో సామానులన్నీ సర్దించాడు సత్యం. సుబ్బాయమ్మ అత్తగారి పాదాలకు నమస్కరించి "వెళ్లొస్తానండి" అని చెప్పి పైకి లేచింది.

మంగమ్మ కోడలిశిరాన్ని స్పృశిస్తూ "ఇంత హఠాత్తుగా వెళ్లే కారణం ఏమిటో నా కర్థం కా లేదు

తల్లీ!" అని ఆమెమొగాన్ని, సమాధానం ఆసించి చూసింది. కాని సుబ్బాయమ్మ ఏవిధమైన సమాధానమూ ఇవ్వకుండానే వెళ్లి బండెక్కింది.

మంగమ్మ బండివెనకాల నిలబడి సంక్షోభిస్తున్న హృదయంతో "ఈ దిక్కుమాలినదానివల్ల ఏవన్నా లోపా లుంటే, అవి మీ మామగారివిగా, ఆ నేరం వారిపై మోపి, ఎవరితో చెప్పొద్దు తల్లీ! వారు నీకూ, నాకూ అందరికీ పూజ్యులే" అంది.

బండి కదిలింది. బాగా వెనక కూర్చున్న సత్యం "మళ్లీ వెంటనే తిరిగొస్తానమ్మా! నేను రానని వంటమాత్రం మానొద్దు" అన్నాడు. బండి రయంగా ధూళిని రేపుకుంటూ సాగిపోవడం చూపుమేఅవరకూ మంగమ్మ చూస్తూనే నిలుచుంది.

సత్యానికి కమీషనువ్యాపారంలో మంచి పలుకుబడీ, అనుభవమూకూడా వుంది. అందుకే అతను అప్పుడప్పుడూ కలకత్తాప్రాంతానికి ప్రయాణమౌతూవుంటాడు.

భార్యను పుట్టింటిదగ్గర విడిచి, తిరిగి యింటికి వచ్చినవెంటనే, కలకత్తానుంచి తంతి రావడం వల్ల కలకత్తా వెళ్లి, తిరిగీ పదిహేనురోజులకు ఇంటికి చేరుకున్నాడు.

సుబ్బాయమ్మను తిరిగీ కాపురానికి తీసుకవచ్చే విషయంలో, చాలా రోజులు కింకర్తవ్యతామూఢుడై ఏమీ నిర్ణయించుకోలేక ఊరుకున్నాడు.

ఒక రోజున మంగమ్మే మాటలసందర్భంలో కొడుకుతో ఇలా అంది: "ఏలాగైనా కాస్త వున్నవాళ్ల బిడ్డ. కొంచెం బెట్టు ఉండడం ఆశ్చర్యం కాదు. నువ్వన్నా వెళ్లి ఆ సంగతేమిటో కనుక్కురారాదూ?"

ఈ మాటలు పేరుపెట్టి 'ఫలానా' అని చెప్పకపోయినా తల్లి ఎవరినిగురించి ఆ మాట లంటోందో అర్థంచేసుకోవడంలో సత్యానికి అట్టేకాలం వృథా కాలేదు.

వ్యథితహృదయంతో తల్లిని ప్రాథేయతగా చూస్తూ "దానిగురించి ఏ మాటా నాదగ్గ రనొద్దమ్మా" అన్నాడు. ఒక నిమిషం మంగమ్మ విస్తుపోయి చూసింది.

"ఏమీ?" అని కళ్లు పెద్దవిగా చేసి అడిగింది.

ఆ మాటకు సమాధానం ఏమీ యివ్వకుండా వెలుపలకు వెళ్లిపోయాడు.

ఆ దంపతుల ఆంతర్యంలో ఏలాంటి గాయం గూడు కట్టుకొని, చిట్టి బాధపెడుతోందో మంగమ్మకు తెలీదుకాని, కొడుకు ఉదాసీనవదనంతో, సమాధానమివ్వకుండా వెళ్లిపోవడంవల్ల మంగమ్మకు గాయం లేకుండానే బాధపెట్టడం ప్రారంభమైంది.

మళ్లీ సత్యం కోస్తాకు ప్రయాణమై వారం రోజులు మకాం వేయడంవల్ల, తన కోడలి సంగతి తెలుసుకోడానికి మంగమ్మకు కొద్ది సావకాశ మేర్పడింది. వియ్యంకుడైన రాఘవయ్యకు ఒక పెద్దమనిషి ద్వారా ఈ విధంగా కబురుచేసింది:

"అబ్బాయివిషయం నా కేమీ పాలుపోవడం లేదు. కోడలిని మీ రిక్కడకు పంపించే ఏర్పాట్లు ఆలస్యంగా చేస్తే, అనంతరం జరిగే ఏలాంటి గొడవలకుగాని నేను బాధ్యురాలుగా మీరు ఊహించడం తప్పుత్రోవను పట్టినట్లవుతుంది. అబ్బాయి కుత్తరం రాసి, ఆలస్యానికి కారణ మేమిటో తెలుసుకోండి".

ఈ విషయాలు విన్న రాఘవయ్య ఆ వచ్చిన పెద్దమనిషితోనే తిరిగీ మంగమ్మకు యిలా సమాధానం పంపించాడు:

"మాది సత్సంప్రదాయంతో కూడుకున్న కుటుంబం. సిగ్గుమాలినవాళ్లతో సంబంధం అందుకున్నందుకు నేను చాలా విచారిస్తున్నాను. ఇంతవరకే నా తల కొద్దిగా వంగింది. అల్లుడు కూతుర్ని విడిచాడనే అపవాదు వస్తే, నా తల భూమిని తాకడం నిజం. సలహా యిచ్చిన నా చెల్లెలిమాట శిరసావహిస్తున్నా నని చెప్పండి."

ఈ సమాధానం అందుకున్నాక, ఎవరు సిగ్గుమాలినవాళ్లో, మానవులు యెందుకు, ఏ పరిస్థితుల్లో సిగ్గుమాలినవాళ్లు కావలసివస్తుందో ఆమె కర్థం కాలేదు. ఆమె ప్రయత్నం కొంతవరకూ ఫలించడ మనే అనం

దంలో తన వంశంపై వేసిన అపవాదు అతి తేలిక పదార్థంలా మాయ మవడంవల్ల, దానినిగురించి ఆట్టే చింతన చేయలేదు.

కలకత్తానుంచి సత్యం వచ్చిన మరునాడే, తన పేరను మామగారు వ్రాసిన ఉత్తరం ఒకటందింది. ఆ వుత్తరం తల్లికి చూపకుండా జేబులో గుప్తపరిచాడు. తల్లికి చాటుగా ఉంచాలనే ప్రయత్నం అతనిలో లేక పోయినా, ఒక నిర్ణయానికి వస్తేనే గాని తల్లితో చెప్ప దలుచుకోలేదు.

మఱునాడు మధ్యాహ్నం భోంచేస్తూ తల్లిని చూస్తూ "నేను సాయంత్రం వెళ్లుతున్నాను" అన్నాడు సత్యం.

ఆత్రంగా "ఎక్కడకూ" అని ప్రశ్నించింది మంగమ్మ.

"నువ్వెళ్లమన్నదగ్గరకు"

ఆమె నవ్వింది. ఆ నవ్వు బిగ్గరగానే ధ్వనించింది. ఆ నవ్వు ఏనాటినుంచో అంతర్గతంగా అణగి ఉంది. తన తండ్రి ఉండగా తన పెళ్లిసంబంధం ఖాయపడి న్నాడు తల్లినోటినుంచి ఈలాంటి నిర్మలమై, నిష్కాపట్యాన్ని తెలియబరిచే నవ్వు విన్నాడు. ఆ నవ్వు అప్పట్లో ఆనందం, ప్రస్తుతం బాధా కలిగించింది సత్యానికి. తల్లిని తీవ్రంగా చూస్తూ "ఎందుకూ నవ్వుతున్నావ్?" అని అడిగాడు.

ఆమె ఎందుకు నవ్విందో ఆ కారణం ఆమెకు తెలుసు. ఆ కారణాన్ని చెప్పినట్లయితే, తిరిగి ప్రతిఫలం ఏరూపంలో వస్తుందో ననే సంగతికూడా తెలుసు. అందుచేత ప్రసన్నంగా చూస్తూ "ఎందుకు నవ్వు రాదూ? ఆ వెళ్లేది నేను చెప్పినప్పుడు వెడితే..." ఇంకా ఏదో చెప్పబోతోండగానే, సత్యం ఎడమ చేత్తో విసరిన ఉత్తరం ఆమెపాదాలచెంత పడింది. వెంటనే ఇలా అన్నాడు: "ఇప్పుడు నాకు నేనై వెళ్లడానికి అంత పౌరుషహీనుణ్ని కాదు. వాళ్లు కోరి వ్రాసినమీదటే, రేపు తీసుకరావడానికి మంచిరోజని వెళుతున్నాను".

ఆ సాయంత్రం ఏడుగంటలకు సైకిలుమీద అత్తవారింటికి చేరుకున్న సత్యాన్ని చూసిన సుబ్బాయమ్మమొగం ఆనందంతో వికసితమైంది.

ఆ సంతోషవార్తను దొడ్డిఅరుగుపై నున్న తండ్రికి అందజేయడానికి వెళ్లింది. వెళ్లినంత త్వరగా చెప్పడానికి, మొదట్లో కాస్త సిగ్గుపడింది. "ఏం అంత తొందరగా వచ్చావ్" అనే ప్రశ్నార్థకాన్ని సూచిస్తోన్న తండ్రిమొగాన్ని చూసి, నెమ్మదిగా "వారొచ్చారు" అని చెప్పింది.

"ఎవరూ?"

ఈ మాటకు ఏమి సమాధానం చెప్పాలో ఆమె కవగాహన కాలేదు. సుబ్బాయమ్మచిన్నచెల్లెలు లక్ష్మి పెద్ద అట్టహాసం చేసుకుంటూ "బావొచ్చాలు" అనే వరకూ రాఘవయ్యకు అల్లుడొచ్చినట్లుగా అర్థం కానేలేదు.

తిన్నగా వీథిలోకి వచ్చాడు రాఘవయ్య. సైకిలు అరుగునకు మోపి, మెట్లెక్కి వస్తోన్న అల్లుణ్ని చూసి "ఇంటిదగ్గర్నుంచేనా రాక?" అని సమర్యాదస్వరంతోనే పలకరించాడు. ఔనన్నట్లు సంజ్ఞాపూర్వకంగా సమాధాన మిచ్చాడు సత్యం.

కాళ్ళూ చేతులూ శుభ్రపరుచుకున్న అనంతరం బల్లపై కూర్చొన్న అల్లుడిదగ్గరగా వచ్చిన రాఘవయ్య "మీ అమ్మగారు క్షేమమేనా?" అని కాస్త హేళనశబ్దాన్ని ధ్వనిస్తూ అడిగాడు.

"క్షేమమే" అని సహజంగా సమాధాన మిచ్చాడు సత్యం. బల్ల ఎదురుగా ఉన్న కుర్చీని సత్యందగ్గరగా లాక్కుంటూ, "ఘోషా చేయడం ఆమెకు అలవాటు లేకపోయినా భర్తపోయిన స్త్రీ ఎలా వుండాలో, ఆమెకు గుర్తుకు తేవడం నీ ధర్మంకదూ?" అంటూ అతని మొగంలోకి చూసి కూర్చున్నాడు.

సత్యం తిరిగి ఏమీ సమాధాన మీయకపోవడం వల్ల రాఘవయ్య స్నేహార్ద్రశాంతస్వరంతో "ఆమె చేసే పని సత్యదృష్టిలో తప్పు కాకపోవచ్చు. ఏస్త్రీగాని చూపని ఆదర్శాన్ని ఆమె చాటిచూపడంలో వచ్చే ప్రత్యేకత ఏముందంటావ్?" ప్రశ్నార్థంగా అల్లుడుకేసి

చూసి, ఒక్కసారి చిరునవ్వును వ్యక్తపరిచి "ఎన్నడూ, ఎవరిచేతా వేలుమడచి చూపుకోని మీ వంశం నేటికి అందుకు పాలుగావలసివస్తున్నది. ఔనంటావా, కాదంటావా?" అనేట్లుగా అల్లుడిమొగంలోకి చూశాడు.

రాఘవయ్యమాటలకు సత్యం మొగంపై ఒక సంశయతెర తొలగిపోయినట్లుగా శ్రద్ధను ద్విగుణీకృతం చేసి వింటున్నాడు.

మళ్ళీ రాఘవయ్య ఉత్సాహపూరితంగా ప్రారంభించాడు: "నీకు ఆమె సవతితల్లి; ఇది యెవరూ మిథ్య పరచలేని నగ్నసత్యం. కాని ఆమెస్వేచ్ఛాజీవనం భవితవ్యంలో ఎవరి శిరస్సు ఛేదిస్తుందో ఆ సంగతి ఆమెకు తెలుసు. అక్కడే భేదం ఉంది. కన్న కొడుకైతే, అతని కయిష్టమైన పని ఆమె ఎన్నడూ చేయ లేదు."

సత్యం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. మామగారి మాటలు సత్యదూరంగా లేవు. ఇంకా వింటున్నాడు:

"మీ రిద్దరూ కన్నవాళ్లకంటే సన్నిహితంగా ఉన్నారంటే నాకు చాలా ఆనందంగానే వుంది. కాని, ఆమెకు నిజమైన మాతృహృదయ ముంటే నీకోసం, నీ పరువుప్రతిష్ఠలకోసం ఆమె స్వల్పమైన తన స్వేచ్ఛను త్యాగం చేయలేదూ?"

నిజమే, ఈ మాటల్లో ఉత్ప్రేక్షగాని, ఉదాసీనతగాని లేనట్లుగా సత్యం గుర్తించాడు. నెమ్మదిగా లేచాడు. రాఘవయ్యమొగంలో ఆశ్చర్యం ప్రకటితమైంది.

"ఏం లేచావ్?"

"రేపు మూడుగంటలకు చాలా మంచిది. మీ అమ్మాయిని ప్రయాణంచేసి ఉంచండి"

అంతవరకూ తండ్రిచాకచక్యాన్ని మానసికంగా అభినందిస్తూ తలుపుమాటుగా ఉన్న సుబ్బాయమ్మకు భర్తమాటలు చాలా అసందర్భంగా కనుపించాయి. గుమ్మంవెలుపలకు తల వంచి, రాఘవయ్యకేసి చూస్తూ "నాన్నగారూ! నన్ను పంపించడానికి మీ రేమీ ఆలోచించవద్దు. ఆ తల్లి ఉండగా ఆ యింట్లో నేను కాపురం చేయలే నన్నమాట వారి దృష్టిలో ఉంటే అంతే చాలు"అని వెంటనే తలుపు చాటుకు వెళ్ళింది.

హతబుద్ధుడుగా కాస్సేపు ఆ తలుపుకేసి చూసి, బరువుగా పాదాలు వేసుకుంటూ గుమ్మం దిగి సైకిలెక్కాడు. ఏదో గుర్తువచ్చినవాడులా గుమ్మంకేసి చూసి "ఆయిల్లు కాకపోతే మరో యిల్లు. కాని ఈ యింట్లోనే నువ్వు స్థిరంగా ఉంటా వనే మాట అబద్ధం" అని అనడంలో, రాఘవయ్య కాస్త చలించి "ఎంత మాట సత్యం! పరువుమర్యాదలు తెలిసున్న మాకు నువ్వు పరాకుచెప్పడం ఆశ్చర్యంగానే ఉంది" అన్నాడు.

ఈ సునిశితమైన అవహేళనకు సత్యం హృదయం బాధపడింది. తిరిగి సమాధాన మీయలేదు. చీడీకి ఎడమకాలు మోపి, సైకిలును ఎదరకు తోయడానికి సిద్ధంగా ఉన్న సత్యం సైకిలు వెనక కారియెర్ పట్టుకొని, రాఘవయ్య ఆసక్తిగా అతని మొగంలోకి చూస్తూ "నే నన్న మాటలు ఏమన్నా బాధగా తోచాయా?" అని అడిగాడు.

ఈ మాట మరీ సిగ్గు కలిగించింది. వంచిన తల పైకెత్తి "లేదు" అని సమాధాన మిచ్చాడు.

వెంటనే తృప్తిగా చూస్తూ "అయితేసరే-రేపు అమ్మాయిని పంపడానికి నా అభ్యంతరం ఏమీ లేదు" అని కాస్సేపు ఆలోచించి "ఈ రాత్రి ఉండి, రేపు ఇద్దరూ కలిసివెళ్ళడానికి వీల్లేదూ?" అని అడిగాడు.

"వీల్లేదు; ఈలోపుగా చేయవలసిన పనులు చాలా ఉన్నాయి"

రాఘవయ్య సైకిలు విడిచాడు. సత్యం ఎదరకు వంగి సైకిలును ఒక్కసారి విసురుగా త్రొక్కి, ఆ చీకట్లో ప్రయాణం సాగించాడు.

సత్యం యింటి కొచ్చేసరికి, మంగమ్మ తలుపు తాళంవేసి, పేటలోకి వెళ్లింది. తాళాన్నిపట్టి రెండుసార్లు ఎదరకు లాగి, నిస్పృహగా పెదిమె విరచి "అబ్బే!......ఇక లాభం లేదు" అని నెమ్మదిగా గొణుక్కున్నాడు.

అరగంట గతించింది. సత్యం శరీరాన్ని గోడకు జారవేసి, అరుగుమీద చతికిలబడ్డాడు. లైటు చేత బట్టుకొని, తిన్నగా మెట్లెక్కి, తాళం తీయ బోతూన్న మంగమ్మకు ఒక అస్పష్టమైన ఉచ్ఛ్వాస ధ్వని వినిపించింది. అరుగుమీద ఎవరో కూర్చున్నట్లుగా కనిపించి "ఎవరూ ?" అని ప్రశ్నించింది. సత్యం సమాధాన మీయలేదు.

నెమ్మదిగా లైటు తీసుకవెళ్లి, అతని మొగాన్ని చూచి విస్మయకంఠస్వరంతో "మీ యత్తారింటికి వెళ్ళ లేదూ ?" అని అడిగింది.

సత్యం తీవ్రంగా చూశాడు. అతని మొగంలో విభ్రమణమౌతోన్న భయంకర ఊహాచిత్రాలను ఆ గుడ్డికాంతిలో ఆమె గమనించలేదు.

"కాస్సేపు కూర్చో; స్నానం చేసివచ్చి వడ్డన చేస్తా" అని మంగమ్మ కొంతవరకూ వెళ్లి, తిరిగివచ్చి "రామాయమ్మకు ఆడపిల్ల. ఇంతక్రితమే ప్రసవించింది. పాపం వాళ్ళకు ఎవరూ లేరుగా! కాస్త సాయంచేసి చక్కా వచ్చాను." అంది.

ఈ మాట విన్నమీదట మనస్సులో ఎంత అక్కసుందో అంతా వెల్లడిచేదామని, ఉన్నచోటి నుంచి పైకి లేచాడు. మంగమ్మ నిస్వార్థ ప్రశాంత వదనం కాస్సేపు చూసినమీదట సత్యం అనదల్చుకున్న మాటలు అనలేకపోయాడు. కాని, "మంత్రసాని రాలేదా ?" అని మాత్రం కష్టంగా అనగలిగాడు.

"రాకేం, వచ్చింది"—అమాయకంగానే సమాధాన మిచ్చింది.

"ఒకవేళ నువ్వే మంత్రసానిబాధ్యత తీసుకున్నావేమోనని అడిగాను" అన్నాడు సత్యం. ఆ మాటల్లో ఉండే ఆంతర్యాన్నికూడా ఆమె గుర్తించలేదు. నిష్కపటంగా నెమ్మదిగా నవ్వి "అది మాత్రం ఏమంత తప్పుపనీ—చేయాల్సిన అవసరం వస్తే తప్పకుండా చేయాల్సిందే" అని సమాధాన మిచ్చింది.

అంతటితో ఆగలేదు సత్యం. కఠినస్వరంతో "పురిటికట్నంకోసం మంత్రసానిపనికూడా తీసుకున్నావా ?" అన్నాడు.

మంగమ్మ విస్తుబోయి సత్యంమొగంకేసి చూసింది. అతను మళ్ళీ ఏమీ మాట్లాడలేదు. ఆమె భారంగా నవ్వి "డబ్బుకోసం పనిచేయడం మీనాన్నగారు నాకు నేర్పలేదనే సంగతి నీకు తెలీదూ ?" ఏమన్నా సమాధానం యిస్తాడేమోనని కాస్సేపాగి "ఆకలిమీ దన్నట్లున్నావ్" అని సమాధాన మిచ్చి, త్వరగా తలుపు తెరచి, మరో చీర కర్రతో అందుకొని, స్నానం చేయడానికి వెళ్ళింది.

వడ్డన అయినతరువాత సత్యంకేసి చూస్తూ "లే నాయనా, వడ్డనయింది" అని మంగమ్మ పిలవగానే సత్యం వెళ్ళి భోజనందగ్గర కూర్చున్నాడు.

అన్నం తింటూనే సత్యం పరధ్యానంగా ఉండడం గుర్తించిన మంగమ్మ "కోడలి ఆరోగ్యం బాగుందా ?" అని అడిగింది.

"రాయిలా వుంది" అని సమాధాన మిచ్చాడు.

ఆ మాటకు నవ్వవలసినది బదులుగా మంగమ్మ మొగం కాస్త మలినమైంది. అన్నం కలుపుతూ కలుపుతూ చేతిని అలాగే వుంచి, దీపంకేసి అర్థశూన్యంగా చూస్తున్న సత్యందగ్గరగా వెళ్ళి "వంట్లో నీరసంగావుందా ?" అని అడిగింది.

"లేదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పాడు. మరచిన పని గుర్తుకు వచ్చినవాడులా అన్నాన్ని కలుపుతున్నాడు.

మంగమ్మ ఇంకా ప్రశ్నలు వేయాలనుకున్నా, సత్యం ఉదాసీనతను గుర్తించిన ఆమె మనస్సు ప్రశ్నలు వేయగల ఉత్సాహాన్ని కోల్పోయింది.

అన్నం కలుపుతూ కలుపుతూ సత్యం హఠాత్తుగా తల పైకెత్తి తల్లికేసి చూశాడు. క్రిందికి చూస్తూ ఆలోచనానిమగ్నయైన మంగమ్మ సత్యం చూపును గమనించలేదు.

"నువ్వు రోజూ అలా అందరిళ్లకూ తిరగడ మెందుకమ్మా ?"

మంగమ్మ తల పైకెత్తి చూసింది. తల్లిచూపు చూసి సత్యం ఏదో నేరం చేసినవాడిలా తల దించాడు. ఆమె నెమ్మదిగా నవ్వినట్లు సత్యానికి వినిపించింది.

"కష్టాల్లో ఉన్నవాళ్ళను సాధ్యమైనంతవరకూ కాపాడ్డమే మంచిదిగా పోయిన మీ నాన్నగారి హితోపదేశ మనే సంగతి మరిచావా ?"అని ప్రశ్నించింది మంగమ్మ.

ఈ సంగతి సత్యానికి తెలుసు. మందులు స్వయంగా చేసి, రోగుల బాధానివారణకోసం ఉచితంగా యివ్వడమూ దగ్గరుండి వాళ్ళకు బాపిరాజు చికిత్సచేయడమూ, సత్యానికి బాగా గుర్తుంది. కాని మగవాడైన తన తండ్రి చేసిన ఆ పనినే ఆడదైన తన తల్లి చేస్తే సమాజంలో ఎంత అవమానం పొందాల్సి వుంటుందో, ఈ రోజున మామగారి నోటంట మొదటిసారిగా విన్నాడు. అప్పటినుంచీ సత్యంమనస్సు ప్రతిఘాతపరాభవానికి తీవ్రంగా చలిస్తోంది.

సత్యం మెల్లిగా తల్లికేసి చూస్తూ "నాన్న చేసిన ఆ పనే నువ్వు చేయా లనే సిద్ధాంతమేమిటి ?" అని అడిగాడు.

మంగమ్మకు ఈ మాట బాధగానే కనిపించింది.

"పరలోకంలో ఉండే భర్తను భార్య ఏనాటికైనా చేరుకోవాలనే సంకల్పమే ఉంటే అతనికి ప్రీతికరమైన పనులు చేయడమే ఆమెవిధి"అని సమాధానమిచ్చింది.

మారు వడ్డన కూడా చేయకుండానే అన్నం దిగ విడిచి లేచాడు సత్యం. మంగమ్మ విస్మయవదనంతో అలా చూస్తూనే ఉండిపోయింది.

అలవాటుప్రకారం ఆ రాత్రి సత్యానికి అరుగుపైన మడతమంచం వేసి, మంగమ్మ యింట్లో పడుకుంది.

కొడుకుప్రవర్తన ఆమెకు ఏమీ అర్థంగాక, చాలావరకూ ఆలోచనలతో కాలాన్ని వ్యయం చేసింది. ఆమెకు నిద్దర పట్టలేదు.

"అమ్మా".—మంచంమీద పడుకునే పిలిచాడు సత్యం. తలుపు తెరచుకొని మంగమ్మ వెలుపలకు వచ్చింది. సత్యం మంచంమీద లేచి కూర్చున్నాడు.

"నే నీ యింట్లో వుండలేనమ్మా !"—అతని మాటలు దుఃఖపూరితంగా వెలువడ్డాయి.

మంగమ్మ హీనస్వరంతో "కారణ మేమిటి ?" అని అడిగింది.

"కారణం తర్వాత నీ కర్థ మాతుంది. రేపు నేను మరో యిల్లు చూసుకుంటున్నాను"అని సమాధానమిచ్చాడు.

ఆమె ఒక నిమిషంవరకూ చైతన్యరహితంగా నిలబడింది. కాస్త తేరుకున్నమీదట ఇలా అంది: "ఈ సంగతి చెప్పడానికేనా నన్ను పిలిచింది ?"

"అవును"అని చెప్పి, మంగమ్మసమాధానం కోసం చూస్తున్నాడు. ఆమెనుండి సమాధానం వచ్చేముందు మ్లానమందస్మితధ్వని మధురంగా వినిపించింది సత్యానికి. తలెత్తి పైకి చూశాడు.

"మంచిది నాన్నా! నువ్వెక్కడున్నా సుఖంగా వుండడమే కావాలి"అని ఆమె నెమ్మదిగా లోపలకు వెళ్ళి, తలుపురెక్కలు రెండూ వేసుకుంది.

ఆ తటస్థభావానికి సత్యంమనస్సు చాలా మథనపడింది. తను చెప్పిన మాటకు వచ్చే సమాధానం అదిగా భావించలేదు అతను..."నువ్వాలా అంటే నాకాధారం ఎవ్వరు బాబూ" అని ప్రాధేయపడుతుందని, వ్యథిత హృదయంతో...చెప్పలేక చెప్పాడు. కాని కనీసం ఎందుకు వెళుతున్నా వనికూడా ఆమె అడగలేదు.

తెల్లవారుఝామున వాకిలి తుడుస్తోన్న చీపురుధ్వని సత్యానికి మెళుకువ తెచ్చింది. నెమ్మదిగా మంచంమీదనుంచి లేచి "అమ్మా"అని పిలిచాడు. మంగమ్మ చీపురు పందెరరాటుకు నిలిపి, కొడుకుదగ్గరగా వచ్చింది.

అతని మొగం ప్రసన్నంగా లేదు. కల్పిత ఊహాచిత్రాలతో అతని మొగం మాలిన్యభూయిష్ఠంగా కనిపిస్తోంది. కాస్సేపు తల వంచి ఏదో ఆలోచిస్తూనే, హఠాత్తుగా తల పైకెత్తి, తల్లికేసి చూస్తూ కఠోరస్వరంతో—"ఈ యిల్లు నేను లాక్కుంటానేమో నని భయపడుతున్నట్లున్నావ్...అందుకే నేను తొందరగా వెలుపలకు వెళ్ళడం ఒకందుకు మంచిదిగా ఊహించావ్. కాని నాకీ యింటిపై ఎప్పుడూ ఆశ లేదు. ఇది నీది. ఇక నీ యిష్టం. వీథులన్నీ తిరిగి,

రోగు లందర్నీ తీసుకవచ్చి, తృప్తి తీరా మానవసేవ చేద్దువుగాని..." అంటూ నవ్వాడు. ఆ నవ్వు స్ఫుటంగా లేదు. ఎర్రబడ్డ మొగంలోంచి వెలువడ్డ ఆ నవ్వు మంగమ్మ బాధాపూరితహృదయానికి మరో బాణంగా తగిలింది. కాని ఆమె ఏమీ మాట్లాడలేదు. సహనమూర్తి అయిన పృథివిలా స్తబ్ధతతో అలాగే నిలబడింది.

"ఏమంటా వమ్మా"—హెచ్చరిస్తూ, బిగ్గరగా సత్యం అడిగిన ఆ మాటకు, హీనస్వరంతో "నీ యిష్టం" అని సమాధానం చెప్పింది మంగమ్మ.

ముందునవ్వులాంటిదే మరో సారి నవ్వాడు సత్యం, హుషారుగా మంచంమీదినుంచి. లేచి "నా యిష్టం గాకపోతే, మరొకళ్ళ యిష్టాయిష్టాలతో నాకు పనిలే దని నీకు తెలీదూ "అని చెప్పి, తొందరగా యింట్లోకి వెళ్ళాడు.

ఒక ట్రంకుపెట్టెను పట్టుకొని తిరిగి వెలుపలకు వచ్చాడు. మంగమ్మ ఆశ్చర్యంగా చూస్తూ "ఇప్పుడేనా వెళ్ళడం!" అంది.

"వెళ్ళడానికి యెప్పుడైతేనేం ?" అని సమాధాన మిచ్చి, తల్లి మొగంలోకి చూస్తూ మెల్లిగా "నేను వెళ్ళడం నీకు సంతోషంగా వుంది కదూ ?" అని అడిగాడు.

ఆమెమొగం క్షణంలో మార్పు చెందింది. సంక్షోభిస్తూన్న ఆమెహృదయగంభీరత కాస్తా సన్నగిలింది. మంగమ్మకళ్లలో నీళ్లు పరికించడం ఇది రెండవ మారు. తండ్రి అంత్యకాలంలో ఒకసారి, ఇప్పుడొక సారి. సత్యం ఆశ్చర్యచకితు డయ్యాడు.

మంగమ్మ దుఃఖాన్ని దిగమ్రింగుతూ "ఏ తల్లి అయినాసరే, కొడుకు యిల్లువిడిచి వెళుతోంటే సంతోషంగా వుంటుం దనే మాట కల్పితం బాబూ! నన్ను మాటలతో బాధపెట్టేదానికన్నా, నీ బాధకు నేను కారకురాలు కాకుండా చేసుకోవడం నీ కవసరం. ఒక అవసరాన్ని గుర్తించి ఇల్లు విడుస్తున్న నువ్వు రెండో అవసరాన్ని గుర్తించకపోవడం నాకు బాధ కలిగిస్తోంది నాన్నా !..." ఇంకా చెబుదామనే ప్రయత్నములో ఉండగానే, ఆమెకంఠం గద్గదికమైంది. ఇక చెప్పడానికి ఆమె ప్రయత్నం చేయలేదు.

సత్యం కొంతవరకూ యెదరకు వెళ్లాడు. కాస్సేపు స్తబ్ధతగా నిలబడి ఆలోచించాడు. వెనక్కి తిరిగి ట్రంకు ప్రక్కన పెట్టి, తల్లిపాదాలకు సాష్టాంగపడి లేచాడు. అతని కళ్లుకూడా నీటితో చెమ్మగిల్లాయి. బాధామిళిత కంఠస్వరంతో "ఆడవాళ్లను అల్ప జీవులుగా యెంచిన ఈ సమాజం నీ స్వేచ్ఛను అపార్థం చేసుకునే మాట అబద్ధం కాదు. ఆ అపార్థాన్ని తృణంగా తీసివేయగల శక్తి నీ కున్నంతగా నాకు లేని మాట నిజం. అందుకే నేను నీకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను." అని పై కండువాతో కళ్ళు తుడుచుకొని "నేను యెక్కడున్నా నీకు ఒక కొడుకున్నాడనే మాట మరచిపోవద్దు. అందరి కష్టాలకూ ను వ్వడ్డుపడుతున్నప్పటికీ, నీ కష్టాల్లో కాపాడే వాడత డొక్కడే అనే మాట నీ దృష్టిలో ఉంచుకో. అవసరం వస్తే గాని, ఆపదలో గాని కబురు చేయి. నా కంతే చాలు." అని నెమ్మదిగా పెట్టె తీసుకొని, ప్రయాణం సాగించాడు.

మంగమ్మ వెళుతోన్న సత్యాన్ని చూస్తూ, ఉన్మత్త ఊర్ధ్వ శ్వాసను విడిచి "నీలాంటి కొడుకును గన్న అమ్మ చాలా అదృష్టవంతురాలు సత్యం" అని నెమ్మదిగా అనుకుంది.

మఱునాడు మంగమ్మ బడ్డీ సరిది ఒక వీసె పొగాకు, ఒక అరటిపళ్ల గెలా కొని, అమ్మకం మొదలుపెట్టింది. 'మంచి పొగాకు కావాలంటే బాపిరాజు దగ్గరే కొనాలి' అనే పూర్వప్రతీతి మంగమ్మ యొక్క ఆ చిన్ని వర్తకానికి చాలా దోహదం చేసింది.

ఆమె కొన్న సరుకులన్నీ ప్రతిరోజూ సాయంత్రానికల్లా అమ్ముడుపోవడం మంగమ్మకు చాలా ఆశ్చర్యంగానే తోచేది. కొట్టు సరిదిన వెంటనే, భర్త ఛాయాచిత్రంయెదురుగా నిలిచి, చేతులు మోడ్చి, కృతజ్ఞతతో కూడుకున్న స్నేహార్ద్రశాంతస్వరంతో "మీ రెక్కడున్నా, ఈ దీనురాలికేసి మీ నిర్మల దృష్టిని ప్రసారిస్తున్నా రని నాకు తెలుసు. అందుకే నాకు బాహ్య ఆధారం లేకపోయినా, అంతర్హితమైన

మీ సహాయసంపత్తితో గెలిచాను. ఎప్పుడూ మఱొకరి ఆర్జనపై ఆధారపడి బ్రతికేట్లు చేయొద్దని నా ప్రార్థన" అనేది. ఇది ప్రతిరోజూ ఆమె జరిపే భర్తృ పూజా విధానంలో ఒక భాగం.

తనకు వచ్చిన ఆదాయంతోనే పొట్ట పోషించుకుంటూ, అవకాశం కలిగినప్పుడల్లా ఇరుగుపొరుగు వారికి సహాయపడుతూ, జీవితాన్ని నెట్టుకుంటూ వుంది మంగమ్మ.

మూడు మాసాలు గడిచిపోయినై.

ఒక రోజు మంగమ్మ పొరుగునవున్న భవానీ గారింటికి వెళ్ళి కూర్చున్నప్పుడు, మాటలసందర్భంలో సత్యంప్రస్తాపన తెచ్చి భవాని ఇలా అంది: "అందుకే సవతిబిడ్డ అంటారు. ఆమాత్రం జ్ఞానముండక్కర్లేమా? కన్నతల్లినే అయితే ఇలా విడిచి చక్కా పోతాడూ? మూర్ఖుడు"

ఈ మాటకు మంగమ్మ ఆనందపడలేదు. పైగా ఆమె శరీరంపై పెద్ద చఱుపు చరచినట్లుగా చలించి "సత్యం చాలా మంచివాడు భవానీ! అబ్బాయిని దూషించడ మనేది పాప మని నా అభిప్రాయం" అని కాస్సేపాగి విస్ఫారితంగా ఆమెకేసి చూస్తూ "సత్యం నా యిష్టంమీదే మఱో చోటికి వెళ్లినప్పుడు, అబ్బాయి నన్ను చూడ్డంలేదనే నేరం మోపడం తెలివితక్కువకదూ భవానీ!" అని అడిగింది.

భవాని విహ్వలురాలైంది. మంగమ్మ అడిగిన దానికి సమాధానం చెప్పకుండా, తెఱచిన నోటిని అలాగే వుంచి చూస్తుండగనే మంగమ్మ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

పొగాకుకోసం వచ్చేవాళ్ళూ, మందులూ, శుశ్రూషలూ ప్రతిఫలశూన్యంగా మంగమ్మదగ్గరనుండి పొందేవాళ్లూకూడా, మంగమ్మనిర్మల స్ఫటికహృదయంపై సత్యంచేసిన పని చాలా ద్రోహ మనే మఱకను స్పృశింప బోయారు. కాని, తాను యిచ్చే తిరుగుసమాధానంతో ఉభయత్రా ఉండే మకిలిని మాయం చేసేది.

ఒక రోజున ఇంటికి తాళంవేసి, మంగమ్మ పేటలోకి వెళ్లేముందు, ఆ రాత్రిసమయాన పందెర లోకి ఎవరో వచ్చినట్లుగా గుర్తించి "ఎవరు వారు?" అని అడిగింది.

"మీరేనా, మంగమ్మగారంటే?"

"ఔను; ఏమిటీ పని?"

"సత్యంగారు, మీ రేలా ఉన్నారో మీ యోగక్షేమాలు తెలుసుక రమ్మన్నారు" అన్న ఆ అపరిచిత యువకుని మాటకు మంగమ్మ ఆనందానికి మేర లేదు.

వెంటనే తాళం తీసి, చిన్న తుంగచాప అరుగు మీద పరిచి "ఇలా కూర్చో నాయనా" అంది.

అతడు చాపపై కూర్చున్నతర్వాత, విశ్వాసాన్ని వెల్లడిపరిచే మొగంతో చూస్తూ "అబ్బాయి రావడానికి కాళీ లేకపోయిందా బాబూ?" అని అడిగింది.

"ఆయన రావడానికి ఎక్కడా తీరిక లేదండీ. నిన్ననే కలకత్తానుంచి వచ్చారు. నేను వారికొట్లో గుమాస్తాగా ఉంటున్నానండి... ఇవి మీకిమ్మని..." ఒక కాగితంపొట్లం ఆమెఎదురుగా పెట్టి "ఇచ్చారు" అన్నాడు.

ఆమె పొట్లం విప్పి చూసేలోగా, రెండు పది రూపాయలనోట్లు కూడా సత్యం యిచ్చినట్లుగా చెప్పి మంగమ్మకిచ్చాడు.

ఆమె వెంటనే ఏమీ సమాధానం చెప్పలేక పోయింది. ఆమె కళ్ళల్లో ఆనందబాష్పాలు నిలిచాయి. వచ్చిన గుమాస్తా మెల్లిగా లేచి అరుగు దిగాడు.

ఆమె భర్తఛాయాచిత్రంకేసి చూసింది. ఎందుకో ఆమెఅంతరాన సంశయవీచిక కదిలింది. వెళుతోన్న ఆ అబ్బాయిని తిరిగి పిలిచింది.

"అమ్మపై సత్యానికున్న అభిమానం నాకు తెలుసు. ప్రస్తుతం ఇవి అనవసరం. అంతగా అవసరమొస్తే, అబ్బాయికన్నా నా కెవరున్నారూ? ఈ సంగతి సత్యానికి చెప్పు" అంటూ అవి తిరిగి గుమాస్తా చేతుల్లో పెట్టింది.

ఆడవాళ్లలో ఇలాంటి వ్యక్తు లుంటారనే నూతనానుభవం పొందినట్లుగా, మననం చేసుకుంటూ తిరిగి వెళ్ళిపోయాడు గుమాస్తా.

మఱునాడు మధ్యాహ్నం మంగమ్మ అన్నం తింటూండగా తలుపు తోసుకొని సత్యం యింట్లో ప్రవేశించాడు. అతని మొగం చూసిన మంగమ్మ ఆనందించవలసినది బదులుగా ఆశ్చర్యపడ్డది.

సత్యం కషాపూరితంగా నవ్వి "నీకడుపులో ఇంత కుళ్ళుందని తెలిస్తే, నువ్వు మంచి తల్లి వని అందరితోనూ చెప్పకునేవాణ్ని కాదమ్మా" అన్నాడు.

ఈ మాటలు వింటూనే, చేతులు కడుక్కోడానికి వెళ్ళి తిరిగివచ్చి "ఇప్పు డేమొచ్చిందీ?" అని అడిగింది.

"నేను పంపించినవి తిరిగి పంపివేయడానికి, కారణం?"

"అవసరం గాని, ఆపదగాని వస్తే కబురుచేయమని మవ్వేగా చెప్పింది. అలాంటి ఇబ్బంది పడకుండా, నిన్ను శ్రమపెట్టడం నా కిష్టం లేక తిరిగి పంపించాను."

ఈ మాటలకు సత్యం కొంత ఆలోచనలో పడ్డాడు. ఒక క్షణం ఊరుకొని, వ్యథితకల్పిత మందస్మితాన్ని ఒక్కసారి వెల్లడిచేసి "అలాంటి అవసరమొస్తే మాత్రం కబురు చేస్తావని నమ్మకమేమిటే?" అని అడిగాడు.

"ఏ జీవికీ అలాంటి అవసరం రాకూడదని కోరడమే మంచిది బాబూ! మీ నాన్నగారు పెట్టిన ఆధ్యాత్మికభిక్షవల్ల నా కలాంటి అవసరం ఎప్పుడూ రా దనే నా నమ్మకం."

ఆతని ఆంతర్యంలో ఉన్న అహంకారానికి మంగమ్మమాటలు ఆజ్యపుబొట్టుల్లా పనిచేసినాయి.

"సరే! నా అవసరం లేకుండా నీవు జీవించ దలుచుకుంటే, నాకు చెందే ఈ యింట్లో వుండడం కూడా అనవసరమేగా—" అని రెండడుగులు ముందుకేసి, ఆగి, వెనక్కి తిరిగి "ఈ యింటిని నాన్న నీ పేర వ్రాసిపోలే దని గ్రహించు" అని గుమ్మం దగ్గరగా వచ్చాడు.

మంగమ్మ మొదట దిగ్భ్రాంతురాలుగా నిలబడి, అనంతరం సత్యంవెనకాలనే నడుస్తూ "నువ్వెల్లా కోరితే అలానే జరుగుతుంది. కాని, అన్నం తినకుండా పోవడమేమిటే?" అని అడిగింది.

సత్యం వెనక్కి తిరిగి ఓసారి చూశాడు. అతని కళ్ళల్లో క్రోధం జ్వాలాయమానంగా పరిభ్రమించడం మంగమ్మ గమనించింది.

తల పంకిస్తూ కటుస్వరంతో—"వె - ళు - తు - న్నా - ను" అని సమాధాన మిచ్చి వెళ్లిపోయాడు.

నాలుగు రోజులు గతించిన తర్వాత మంగమ్మ కబు రందుకొని సత్యం తిరిగి యింటికి వచ్చాడు. ఇల్లు చూచి మొదట చాలా ఆశ్చర్యపోయాడు. మంగమ్మ యింట్లో లేదు. ఇంట్లో ఒక వస్తువు కూడా లేదు. అతని అనుమానం స్థిరపడినట్లుగా నిర్ణయించిన మీదట అతని కళ్ళల్లో నీళ్ళుకూడా తిరిగాయి.

వెనకనుంచి వచ్చిన మంగమ్మ రాకను అత నేమీ గుర్తించలేదు. ఆమె సుప్రశాంతవదనంతో సత్యాన్ని చూస్తూ "ఇంటితాళం నీ కిద్దామని కబురు చేశాను" అంది.

అత నేమీ మాట్లాడలేదు. గది మధ్యగా నేల మీద కూచొని, మంగమ్మకేసి అగమ్యంగా చూస్తున్నాడు.

ఆమె యిలా అంది: "అద్దెయిళ్ళు దొరక్క అవస్థ పడుతున్నట్లు విన్నాను. కోడలు కూడా పట్టి మనిషి కాదటగా! ఇక పరాయిఇంట్లో వుండి బాధపడేదానికన్నా ఈ యింట్లో వుండడమే ఎంతో మంచిది."

చూస్తుండగానే సత్యంకళ్ళు జలపూరితమయ్యాయి. ఏమి మాట్లాడాలో అతని కర్థం కావడం లేదు. చీకటిలో ఉన్న అతని మొగాన్ని మంగమ్మ గుర్తించలేదు. మళ్ళీ ఆమె ఇలా అంది:

"నేను ఆపేట చివారున సూర్యకాంతంగారి వసారా అద్దెకు తీసుకున్నాను... నెలకు నాలుగురూపాయలు; పెద్ద అద్దెకాదు....అఁ, ఏమిటదీ!" సత్యం కుదిల్లి ఏడుస్తున్నాడు. ఆ ఏడ్పుధ్వని విన్న ఆమె దగ్గరగా వెళ్ళింది. అతని శిరస్సు స్పృశిస్తూ— "చంటిపిల్లాడులా అదేం పనీ! నాన్న జ్ఞాపక మొస్తేమటుకు, ఈ వయస్సులో అలా ఏడ్చేవాళ్లున్నారూ! తప్పు

బాబూ!" అంది. సత్యం, నేలమీదనుంచి లేచి, తైలధార లాగా కారుతోన్న కంటినీటిని తుడుచుకొంటూ "తప్పే నమ్మా! ఇక ఎప్పుడూ నిన్నేమీ అనను." ఆమెపాదాలమీద వాలాడు. ఆమె లేవదీసి "దీనిలో నీ తప్పేముందీ?" అని అడిగింది. సత్యం గద్గదికంగా "మమ్మాటికీ తప్పేనమ్మా! ఆవేళ ఏదో కోపంకొద్దీ అలా అన్నానుగాని, ఈ నీయింట్లో నేను ఒక్క క్షణం ఉండగలనా? అలా కుదరదు. ఆ సామాను తెప్పించుకొని, యథాప్రకారం ఉండు... ఇక పొరపాటుగానైనా నిన్నేమీ అననమ్మా" అంటూ ప్రాధేయతగా ఆమెకేసి చూశాడు.

మంగమ్మకళ్ళుకూడా నీటితో చెమ్మగిల్లాయి. "నువ్వన్నందుకు కోపంతో నే నా పనిచేయ లేదు బాబూ! ఈలాగనైనా మనం ఒక్క పేటలో ఉండి, కోడలినీ, నిన్నూ కళ్ళతో చూడగల అవకాశం లభిస్తుందని చేశాను... ఇక, నిర్ణయమైన తరువాత సామాను తీసుకురావడం బాగుంటుందా" అని సంశయంగా అతనికేసి చూసింది.

"నాకు తెలియకుండా ఒక్క పనికూడా చేయనిదానవు నువ్వీనాడు ధైర్యం చేయడానికి మనస్సేలా ఒప్పింది...... నీకు చేతగాకపోతే, ఆ సామాను నేను తీసుకువస్తాను" అంటూ అతను తొందరగా వీథిలోకి వెళ్ళిపోయాడు. ఆమె రెండుకళ్లూ తుడుచుకొని ఒక్కసారి తనలో నవ్వుకుంది.

ఒక బండి మాట్లాడి, వసారాలోని సామానులు బండిమీద వేయిస్తున్నాడు సత్యం. ఇంట్లో ఉన్న సూర్యకాంతం వెలుపలకు వచ్చి ఆశ్చర్యంగా చూస్తూ "అదేం పనీ సత్యం?" అని అడిగింది. "ఏముందీ? మాఅమ్మ మీయింట్లో అద్దెకు ఉండవలసిన దుర్గతేమీ రాలేదు...... మీరంతా కలిసి, మాఅమ్మను నాకు దూరం చేయాలని ప్రయత్నం చేసినా, ఆమెకు నేను దూరం కావడం కష్టం" అని బండెక్కాడు.

"అయితే నువ్వన్నది సొంతయింట్లోనేనా?" అని ఆమె అడిగింది. ఆ మాటకు ఏం సమాధానం ఇవ్వాలో సత్యానికి తెలియలేదు. మొగంపై అస్పష్టమైన అంధకారం అలుముకుంది. ఆమెకేసి ఒకసారి మొగం చిట్లించి చూసి "నువ్వడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పేరోజు రాకపోదు" అని, బండివానితో "బండి పోనియ్యి" అన్నాడు. బండి కదిలింది.

వెళుతున్న బండికేసి చూస్తూ సూర్యకాంతం "అవ్వ!" అని నో రొకసారి నొక్కుకుని "ఇదెక్కడి విడ్డూరమమ్మా!" అనుకుంది.

సామాను యథాప్రకారం ఇంటికి చేర్చి, మంగమ్మదగ్గిర శలవు తీసుకొని తను కాపురమున్న గాంధీనగరం చేరుకున్నాడు సత్యం.

ఆరాత్రి సత్యం మాటలమధ్యలో భార్యదగ్గిర ఒక విచిత్రమైన సంభాషణ తెచ్చాడు.

"ఈ అద్దెకొంపల్లో ఉండేబదులు ఇల్లు కాస్త బాగుచేసి అక్కడికి పోతేనే బాగుండేటట్లు తోస్తోంది" అన్నాడు.

"మీ యమ్మో?"

"మన దగ్గిరే ఉంటుంది"

"మళ్ళీ ఈ ఆలోచన ఎప్పటినుంచీ?" అని సుబ్బాయమ్మ కొద్ది కోపంతోనే అడిగింది.

"ఇదెప్పుడూ ఉన్న ఆలోచనే" అంటూ పందెరమంచం టాపుకేసి చూస్తూ "ఆడదాని మాట విని అప్రయోజకత్వం వహి స్తేమాత్రం... అది గుర్తించగలలోకు లుండరూ? సరే..." అంటూ మంచంమీద పడుకున్నాడు.

బల్లమీద కూర్చున్న సుబ్బాయమ్మ లేచి, అటు తిరిగి పడుకున్న భర్తశరీరాన్ని తీక్ష్ణంగా చూస్తూ "నాతండ్రిది పరువుగల కుటుంబమనే సంగతి నే నెప్పుడూ మరిచిపోను. సిగ్గు లేనివాళ్ళ సంబంధం అందుకున్నందుకు మా నాన్న ఇప్పటికే సగం చావడమైంది. ఆడదై, అందులోనూ విధవైన స్త్రీ సిగ్గూ శరం లేకుండా తిరిగే ఆవిణ్ణి నా అత్తగారని ఏ నోటితో చెప్పుకోవాలో నా కర్థంకావడం లేదు..." ఆ మాటని, గర్వసూచకంగా సుబ్బాయమ్మ నవ్వింది.

సత్యం చటుక్కున మంచంమీదినుంచి లేచాడు. "నీకు ఆడదాన్ననే స్పృహ ఉంటే, నేను

చెప్పినట్లు వినడంకూడా నీ ధర్మమేకదూ!" అని అడిగాడు.

"మీ అరచేతల్లో ప్రాణాలను అర్పిస్తాగాని, ఆమె ఉండగా ఆ యింట్లో కాలు పెట్టను."

తిరిగి అటేను పడుకున్నాడు.

ఆడవాళ్ళలో కొందరు పుట్టింటి దగ్గర్నుంచి తీసుకవచ్చే వస్తుసముదాయంలో కనుపించని, కర్కశమైన ఈ స్వాభిమాన మనే వస్తువును కూడా తీసుకువస్తారు....ఆ కనుపించనిదాన్నయినా పరుల కనులకు స్పష్టపరచేందుకు తమ పుట్టింటివారి ప్రతిభను కనే కళ్ళ చాటి, తమ అత్తవారి వ్యక్తిత్వాన్ని దాని ముందు తృణమని గర్జించక పోయినా, ఆ భావం వచ్చేట్టుగా మాట్లాడ్డం చాలామందికి ఎలా అలవాటో సుబ్బయమ్మకు కూడా అదే అలవాటై ఊరకుంది.

కనుపించని ఆ స్వాభిమాన కఠోరహస్తాల్లో ఎన్ని మూగజీవులు వ్రగ్గి అజ్ఞాతభారంతో క్రుంగి పోతున్నాయో, ఈ సత్యాన్ని ఉదాహరణగా తీసుకుంటే చాలనుకుంటాను.

అతిగర్వ మనే ప్రతిదానికీ గర్వభంగ మెలా సహజమో, ఈ ఉద్రేకంతో కూడిన స్వాభిమానానికి కూడా శిరం వంచగల స్థితి స్త్రీజాతికికూడా అప్పుడప్పుడు కలగడమున్న అలా అసహజం కాదనుకొంటాను.

రెండువారాలు గడిచిన తర్వాత సత్యం తల్లిని చూడ్డానికి వచ్చి "దాన్ని పుట్టింటికి పంపేశాను" అని చెప్పాడు.

మంగమ్మ భయభ్రాంతంగా చూస్తూ "ఇప్పుడు పంపవేసినంత అవసర మే మొచ్చిందీ!" అని అడిగింది.

"వాళ్ళ నాన్నకు రెండు రోజులనుంచి జ్వరం కాస్తోందట!"

"ఏం జ్వరం?"

మంగమ్మ ఇలా అడగడంలో అర్థముంది. ఒక వారం రోజులనుంచి, అక్కడక్కడా మశూచి వ్యాధి అంకురిస్తూ, కొందర్ని తనలో ఐక్యం చేసుకోవడం ప్రారంభించింది. కాస్సేపు ఉదాసీనంగా చూసి—

"ఏమో!" అని సమాధానం ఇచ్చాడు.

"అంత అవివేకంగా ఉంటే సంసారాన్ని ఎలా దిద్దుకుంటావ్?...వట్టి మనిషి కాదుగా. ఈ రోజులు ఎలాంటివో తెలుసా?"

సత్యం ఏమీ మాట్లాడలేదు.

"వెంటనే వెళ్ళి, ఆ జ్వరానికి ఎలాంటి సూచన లున్నవో తెలుసుకొని...కోడల్ని అక్కడనుంచి తీసుకొచ్చేయ్...అంతగా అతనికి శుశ్రూష కావాలంటే నేను చేస్తాను."

సత్యం విభ్రాంతుడై కాస్సేపు నిలిచి, తిరిగి జగన్నాథపురం వెళ్ళాడు.

సత్యం మామగారింటికి వెళ్ళేముందే అది మశూచి జ్వరంగా నిర్ధారణ అయిపోయింది.

ఆ ప్రక్కింటి ఆడమనిషి మూడురోజులక్రితమే ఆ వ్యాధికి బలిఅవడం ఆ ఇంటిల్లిపాదికీ తెలుసు.

సత్యం మామగారిని చూడ్డానికి వెళ్ళాడు. అప్పటికే అతని శరీరంమీద అక్కడక్కడా బొటిమలు లేచాయి.

అల్లుణ్ణి చూసి కళ్ళ నీళ్ళు తెచ్చుకొని "ఇక నేను బ్రతకటం కష్టం. ఈ కుటుంబాన్ని ఎలా కాపాడుతావో!" అని దుఃఖించాడు.

సత్యానికి అత్తగారేగాక ఇద్దరు మరదళ్లు, ఒక పాలుత్రాగే కుర్రవాడూ ఉన్నారు. "పాపం, నిజమే" అనుకున్నాడు మనస్సులో సత్యం.

గది దాటి వెలుపలకు వచ్చాడు.

సుబ్బాయమ్మ వచ్చి "మిమ్మలను మా అమ్మ పిలుస్తూంది" అని ఆతృతగా అంది.

సత్యం ఆమె దగ్గరగా వెళ్ళాడు. తలుపుచాటు నుండి అత్తగారి కంఠస్వరం దుఃఖపూరితంగా ఇలా వినిపించింది: "అమ్మాయి వట్టిమనిషి కాదు. మేమంతా ఆడవాళ్ళం...ఆయన మొగం చూసే ధైర్యం కూడా మాలో లేదు. మీ రెక్కడికీ వెళ్ళడానికి వీలులేదు."

అత్తగారి మాట సత్యం కాదనలేకపోయాడు. సత్యం వెళ్లిన రెండోరోజున సుబ్బాయమ్మ భర్తను రహస్యంగా పిలిచి "మీరుమాత్రం ఇక్కడుండకూ? ఎటు తిరిగి ఎటొస్తుందో! మీ యమ్మదగ్గరకు వెళ్లండి" అని హితోపదేశం చేసింది.

మనస్సులో నవ్వుకొని పైకి నిర్లక్ష్యంగా—"నా కా భయం లేదులే"అన్నాడు.

మరునాడు రాఘవయ్యపరిస్థితి కాస్త క్లిష్టంగానేఉంది. బొబ్బలు పెద్దవయ్యాయి. ఆడవాళ్లు అతన్ని చూడడానికే భయకంపితులౌతున్నారు. అతనికి తగిన శుశ్రూష చేసే బాధ్యత సత్యమే తీసుకున్నాడు.

సత్యంఅత్తగారు సత్యానికి కబురు చేసింది. సత్యం వచ్చి గుమ్మందగ్గిర నిలబడ్డాడు. తలుపు చాటునుండే ఆమె రోదనస్వరంతో "నా కేం మతి లేదు బాబూ! పిల్లలతో ఈ ఇంట్లో ఉండడమే చాలా భీతిగా ఉంది" అని అంది.

తలుపుకేసి ప్రశ్నార్థకంగా చూస్తూ "ఏం చేదామని ఆలోచించారు" అని అడిగాడు సత్యం.

"నర్సాపురంలో మా మేనత్తగారిల్లుంది. అక్కడకు వెళితే?"

"ఎవరూ ?"

"పిల్లలూ, నేనూ."

రెట్టించిన ఆశ్చర్యంతో చూస్తూ "ఇక్కడెవరుంటారూ ?" అని దృఢంగానే అడిగాడు సత్యం. ఈ మాటకు ఏమి సమాధానం చెప్పాలో అత్తగారికి అవగాహనకాక అడ్డుగా ఉన్న తలుపుకేసి చూస్తోంది. ఈ సంగతంతా విన్న సుబ్బాయమ్మ భర్తఎదురుగా వచ్చి, ప్రక్కగా తల తిప్పి తల్లికేసి చూస్తూ—

"ఇంత పెద్దదాన వయ్యావండి, ఏ విధంగా మాట్లాడాలో తెలీ దేమిటమ్మా!" అంటూ భర్తకేసి తిరిగి, "అది కాదండీ! నన్నూ, మిమ్మలనూ ఇక్కడుంచి, నర్సాపురం వెళ్ళి పిల్లలను వప్పజెప్పి తిరిగి వస్తుందట" అని చెప్పడంలో అసలు తల్లి ఉద్దేశాన్ని ఏ విధంగా మభ్యపెట్టిందో గ్రహించిన సత్యం వెటకారంగా "అదా విషయం! అయితే సరే" అని కాస్త రాగం తీసి, కళ్లు త్రిప్పి లోపలకు వెళ్ళిపోయాడు.

"మీ సత్సంప్రదాయంలో ఉండే బండారం కాస్తా బైటపడింది" అనే భావం వచ్చేటట్లుగా పెట్టిన భర్తముఖభంగిమ గమనించి, మొదట మందహాభినయం చేసి చాటుగా తల్లిని చివాట్లు పెట్టింది.

సూరమ్మ పిల్లలను చంకను వేసికొని గుమ్మం దిగే సమయంలో మంగమ్మ ఎదురైంది. మొదట ఆశ్చర్యంగా ఒకళ్ల నొకళ్ళు చూసుకున్నారు.

"ఎక్కడికే ప్రయాణం ?"అని అడగాలనుకుంది మంగమ్మ. ఎక్కడికైనా ప్రయాణమటుకు నిజమని నిర్ధారణ చేసుకున్న మీదట—

"అన్నాయి కెలా ఉందీ ?"అనిమాత్రం అడగగలిగింది.

ఆమాటకు సూరమ్మ సమాధానం ఏమీ ఇవ్వలేకపోయింది. బిత్తరి చూపులు చూస్తూ మెట్లు దిగింది. మంగమ్మ మెట్లు ఎక్కుతూ వెనక్కి తిరిగి సూరమ్మకేసి చూసింది. సూరమ్మమొగంలో దైన్యం వివిధ రూపాలుగా వ్యక్తం కావడంవల్ల మంగమ్మ మాట్లాడలేక పోయింది.

గుమ్మందగ్గరగా ఉన్న సుబ్బాయమ్మ అత్తగారి రాక గమనించి, తండ్రిదగ్గ రున్న సత్యందగ్గరగా వచ్చి తల్లివచ్చినసంగతిచెప్పడంవల్ల, సత్యం సరాసరి వీథి గుమ్మందగ్గరగా వచ్చి "ఎందు కొచ్చావమ్మా?" అని కఠినంగా పలకరించాడు.

సుబ్బాయమ్మ తలుపుచాటునుండి తల్లీ కొడుకుల సంభాషణ వింటోంది.

వచ్చిన చుట్టాన్ని సత్కరించే విధానం సత్యానికి ఇంతకన్నా మించి తెలీదనే సంగతి తెలిసిఉన్న మంగమ్మ ఆమాటకు ఏమీ కష్టం కలిగించుకోకపోగా, ప్రశాంతంగా నవ్వి, మార్దవ కంఠస్వరంతో ఇలా అంది: "నే నెందుకొచ్చానో నా కన్న యెక్కువగా నీకు తెలుసు" అంతటితో ఆగి, నెమ్మదిగా "నేను నీతో ఏమి చెప్పిపంపాను ? నువ్వు చేసిన ప నేమిటి?" అంది.

ఈ మాటకు సత్యం బిగ్గరగా నవ్వి "పిచ్చితల్లీ!" అని లోపల నెమ్మదిగా గొణుక్కుని, "ఆయనకు చాలా ఎక్కువగా ఉందమ్మా! నా ఆసేవాళ్ళే విడిచి పారిపోతోంటే ఆయనగ తేం కాను?" అన్నాడు. ఈమాట ఎవరినిగురించి భర్త అన్నాడో సుబ్బాయమ్మకు తెలుసు. ఈ మచ్చ జీవితాంతంవరకూ నిలిచి తన్ను ఎంతగా అవమానంతో క్రుంగజేస్తుందో గ్రహించిన సుబ్బాయమ్మ ఏమీ మాట్లాడలేక పోయింది.

మంగమ్మ రాఘవయ్య ఉండే గదిలో ప్రవేశించింది. కిటికీలు బిడాయించి గదంతా చీకటిమయంగా ఉంది. వెగటు గలిగించే గబ్బువాసన కొడుతోంది. ఆమె గదిలో కాస్సేపు నిలిచినమీదట రాఘవయ్య అస్పష్టంగా, అనాకారిగా మంచంమీద కనుపిస్తున్నాడు.

"అన్నాయ్!" దగ్గరకు వెళ్ళి పలుకరించింది మంగమ్మ. హీనస్వరంతో "ఎవరూ?" అన్నాడు రాఘవయ్య.

సుబ్బాయమ్మ అభిమానంతో తలవంచుకొని "అత్తగారు" అని సమాధాన మిచ్చింది. బొబ్బలు తేరిన కనురెప్పలు బరువుగా పైకెత్తి "మంగమ్మా!" అన్నాడు.

హఠాత్తుగా ఉద్భవించిన ఆశ్చర్యప్రకటనార్థం అన్న ఆ మాటలు సత్యంఅపార్థానికి కారణం కావడంలో ఆశ్చర్యం లేకపోయింది. కటుస్వరంతో "ఆపత్కాలంలో అడ్డుపడేవాళ్ళకు మీ రిచ్చే అవమానకరమైన బిరుదు అమ్మకు తేలీదులెండి... తెలిసుంటే ఆమె వచ్చేదే కాదు" అన్నాడు సత్యం.

రాఘవయ్య జాలిగా అల్లుడికేసి చూస్తూ "ఇప్పుడా నన్ను బాధపెట్టడం?" అన్నాడు.

పనిలేనివాళ్లకు చేతినిండా పని దొరికినప్పుడు చూపే పనితనం, దానితోబాటు వచ్చే ఆనందం, తృప్తీ మంగమ్మ అనుభవిస్తోంది.

'రోగిగది ఎలా ఉండాలి' అనే ప్రాథమిక సూత్రం కూడా సత్యం గ్రహించలేనందుకు మంగమ్మ ఆశ్చర్యపడ్డది.

కిటికీ లన్నీ తెరువబడ్డాయి. సమీరుడు సంతోషంగా గదిలో ప్రవేశించాడు.

రసితో మచ్చలతో నున్న బట్టలు స్వహస్తంతో తీసిన మంగమ్మ, ఆ స్థానే ఉతికిన బట్ట లుంచి, శుభ్రత నవ్యక్తంచేసే సూక్ష్మమైన పద్ధతిని దగ్గరున్న కొడుక్కి చూపింది.

గదంతా సాంబ్రాణి, అగరువత్తుల పొగతో నింపింది. భర్త తన కిచ్చిన వరంలా పూజిస్తోన్న కొన్ని వనమూలికల శక్తి పరీక్షించే సమయం ఇదిగానే ఆమె భావించి కొంతగా తగ్గుస్థితికి వచ్చినతర్వాత ఒక చెట్టు ఆకురసాన్ని అతని శరీరానికి తాకించి, విసనకర్రతో విసురుతూ, దిన మెల్ల శుశ్రూష చేసింది.

తల్లి రావడంవల్ల సత్యంహృదయం తేలికపడ్డది. తల్లికి కావలసిన వస్తువులు ఇవ్వడంతప్ప చికిత్సాబాధ్యత నుండి సత్యం తప్పుకున్నాడు. ప్రతినిముషం వచ్చి భర్తను పలకరించే సుబ్బాయమ్మ అతని దృష్టికి కాస్త దూరంగా ఉండడానికి ప్రయత్నం చేస్తోంది. అది గ్రహించిన సత్యం ఆమెను పలుకరించి ఆంతరంగికమైన ఆమెఅభిమానతెరను తూట్లుపరచడానికి ప్రయత్నం చేయడం లేదు.

మంగమ్మంటే వింతమనిషిగా భావించిన సుబ్బాయమ్మ 'వింత'అనే పదాన్ని దేవతగా మార్పు చేసుకుంది.

మంగమ్మకు దేవతాత్వాన్ని ఆపాదించడం ఉత్ప్రేక్షగా మాత్రం సుబ్బాయమ్మ భావించలేను.

మంగమ్మప్రశాంత వదనాన్ని పరిశీలించిన ప్రతి ఒక్కరికీ ఆ భావం తప్పక కలుగుతుందనే నమ్మకం సుబ్బాయమ్మకు స్థిరపడి ఊరుకుంది.

సుబ్బాయమ్మ తండ్రిగదిలోనుంచి రావడం పూర్తిగా నిషేధింపజేసింది మంగమ్మ. తాత్కాలికంగా సుబ్బాయమ్మకు ఆ ఉదాసీనత బాధ కలిగించినా ఆమె ఎందుకు తన్ను నిషేధించిందో తెలిసినమీదట సంతృప్తిగా నిట్టూర్చి ఊరుకుంది.

మంగమ్మ వచ్చి నాలుగురోజులు గడిచింది. నానాటికీ నిద్రమాలిన మంగమ్మ శుష్కించడం, రాఘవయ్య తేరుకోవడం జరిగింది. ఉదయాన్నే రాఘవయ్య గదిలోనుంచి వచ్చిన సత్యం భార్యకేసి చూస్తూ "నక్క నోట్లో వెడ్డకొట్టాడు మీనాన్న" అన్నాడు. ఆ వ్యంగ్యానికి అర్థ మేమిటో సుబ్బాయమ్మకు అర్థం కాలేదు.

"ఏమిటి మీ రనేది ?"—ఆత్రంగా అడిగింది.

"రోగం దిగమారింది."

"నిజం !" నోరు పెద్దది చేసీ, కళ్ళు విశాలం చేసి, ఆనందం తీరా ప్రశ్నించింది సుబ్బాయమ్మ.

"నమ్మకం చాలకపోతే వెళ్ళి చూడరాదూ ?" అని నెమ్మదిగా వీథిలోకి వెళ్ళాడు సత్యం.

సుబ్బాయమ్మ గదిలోకి ప్రవేశించేసరికి మంగమ్మ రాఘవయ్యపాదాలచెంత కూర్చొని, విసనకర్రతో విసురుతోంది. ఆమెనేత్రాలు ధ్యానప్రపూర్ణంగా అర్ధనిమీలితంగా రాఘవయ్యశరీరంపై ప్రసారితమైనాయి.

"అత్తాయి !"

ఈ పిలుపు మంగమ్మ కంత వినపడ లేదు. వినగల అర్హత పొందగల ననే భ్రాంతికూడా లేదేమో. ఆశ్చర్యంగా తల తిప్పి చూసింది.

"నాన్నకు పొక్కులు దిగమారాయటకదూ ?" అని అడిగింది సుబ్బాయమ్మ.

"ఔనమ్మా" అని మెల్లిగా సమాధానం చెప్పి "నిన్ను ఇక్కడకు రావద్దని చెప్పడం మరిచావా ?" అని అడిగింది మంగమ్మ.

సుబ్బాయమ్మ తిరిగి వెళ్లిపోయింది.

ఆ మధ్యాహ్నం భర్త భోజనము చేస్తూండగా సుబ్బాయమ్మ "అత్తాయికి రేయింబవళ్లూ నిద్దుర లేదు. ఈ వేళయినా ఆమె విశ్రాంతి తీసుకోకూడదూ ?" అంది.

అత్తగారిపట్ల జనించిన ఈ అసమాన సానుభూతికి కారణం ఏమిటో సత్యానికి గ్రాహ్య మైంది. ఇది తాత్కాలికం కాదని నిర్ధారణ చేసుకున్న మీదట చిరునవ్వే దానికి సమాధానంగా ఇచ్చి ఊరుకున్నాడు.

రాఘవయ్యకు స్నాన మైందని తెలిసిన మీదట సూరమ్మ బిడ్డలతో తిరిగీ జగన్నాథపురంలో స్వగృహానికి చేరుకుంది.

ఆనాడు మంగమ్మ తప్పితే ఎవరూ అంతగా యిష్టంగా ఆమెతో మాట్లాడకపోవడం సూరమ్మకు చాలా కష్టంగానే ఉంది. కాని దానికి కారణాన్ని ఊహించిన మీదట తన పిరికితనానికి ఎక్కువగా సిగ్గుపడింది.

మంగమ్మ ప్రయాణమై రాఘవయ్యదగ్గర శెలవు తీసుకోడానికి వచ్చింది.

ఆమెరాక గమనించిన రాఘవయ్య స్నేహపూర్ణకంఠస్వరంతో "నీ ఉపకారాన్ని మరువలేను చెల్లాయి ! నాకు ప్రాణదానం చేసింది ఎవ రని ఎప్పుడైనా ఎవరైనా అడిగితే, 'పిరికిపందకాని నా మంగమ్మ చెల్లాయి' అని చెప్పగల ధైర్యాన్నిచ్చావ్ ! నాకు అంతే చాలు. ఆడవాళ్ళు అబల లనే మాట ఎంతవరకు నిజమో నేను చెప్పలేను. కాని అబలాత్వమే నైచ్యమైన పిరికితనంగా అర్థంచేసుకున్న నా భార్యమాత్రం నీ కాలిగోటికికూడా పోల దనే మాట సత్యం !" ఆఖరి మాటలు ఆంతరంగికంగా గూడుకట్టుకొన్న అతని కఠంను వెల్లడి చేసినట్లుగా పళ్ళసందునుంచి ధ్వనించినై.

మంగమ్మ నవ్వింది. ఆ నవ్వు విని రాఘవయ్య ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు.

"మానవుల హృదయంలో మా ర్పనేది ఎప్పుడు కలుగుతుందో, ఇప్పుడే గ్రహించాను. కాని నేను చేసిన శుశ్రూష మరొకళ్ళను నీచపరచడానికీ, నేను ప్రత్యేకత పొందడానికీ అనే అపార్థాన్ని మాత్రం తీసుకోవద్దు". కాస్సే పాగి నెమ్మదిగా నవ్వి "బ్రతకాలనేవాళ్ళు భయంకరమైన రోగానికి బెదరడంలో తప్పు లేదు" అని అర్ధనిమీలితంగా ఆకాశంకేసి చూస్తూ "వారితోపాటే చచ్చిన నా శరీరానికి మాత్రం భయం లేదనీ, సారహీన మైనదనీ తెలిసిన మీదటే వారి ఆదేశాన్ని నేను ఆచరిస్తున్నాను." అని చెప్పింది.

రాఘవయ్య మొగాన్ని సిగ్గుదొంతర్లు కప్పినాయి.

మంగమ్మ సుమ్మం దిగేలోపల సుబ్బాయమ్మ దగ్గరగా వచ్చి "అత్తాయి! నేను కూడా వస్తున్నాను" అంది.

"ఎక్కడకూ ?"

"మనింటికి"

ఆప్యాయంగా ఆమె శిరస్సును హృదయాని కద్దుకుంది మంగమ్మ.

స్తంభానికి జేరబడి నిలుచున్న సత్యం తృప్తిగా నిట్టూర్పు విడిచాడు.

ఆ రోజునే సవతి కొడుకుతో స్వగృహానికి చేరుకుంది మంగమ్మ.

హా ఫీ జ్ గీ తి క లు

— శ్రీ కృత్తివాస తీర్థులు —

౧

ఆగలేనే సఖీ, ఆసవ మ్మాసవము
అందులకె యీ తపన ఆసవమ్మాసవము!
ఏ నెటుల సహియింతు నీ చిత్రవిరహార్తి
ఎవరు గ్రహియించెదరు హృదయాంతర
వ్యథను ! ...ఆసవ

ఆసవము ప్రేయసీ, అంగారుణ సవము
నింపుమా యెదనిండ కెంపుతళతళ మదిర
...ఆసవ

నీ మోవి కెంజాయ నింపర దిశలెల్ల
నీ దరస్మితరుచులు నింగి వెన్నెలకాయ
...ఆసవ

కటిమేఖలా ఘుంఘుంలశింజితావళుల్
నా జీవన ప్రాంగణమ్మున నింపర...ఆసవ
ముద్దుగుమ్మా, నీదు ముంగురుల వాసనలు
హరియించినవి సుమీ యామినీ పవనములు
...ఆసవ

౨

నీమనసు హాఫీజు, నిజముగా మలినమ్ము!
మలినమ్ము చేయగా వలదు సఖివదనమ్ము.
మాధ్వీకమే లేని మధుమాస మింకేల?
గండస్థలము లేని కమ్రానిల మ్మేల?
ఆలింగనము లేని ఆకార మెందులకు?
...నీమనసు...

అమృతమ్ము చిందు నీ యరుణాధరోష్ఠమ్ము
పరభృతము పాడగా ఫలవంత మాజమ్ము
స్వాంతమ్ము మూర్తించు స్వప్నాలు వమ్మగును...నీమనసు...

ప్రణయినీ హీనమౌ భావమ్ము వృథ యగును
మధువునం బ్రభవించు మధురిమోద్గారమ్ము
జవ్వనంబును గాంచు జరఠవిపినము లేని
...నీమనసు...